# ఈ వారం కథ

—జి. నిర్మలారాణి

ఆకలికి అలమటిస్తూ తిండిలేక చచ్చిపోయే దశలో వున్నా, తోటి మనిషి కష్టంపట్ల స్పందన గలిగితే, ఆ మనిషి బతుకుతున్నట్లే లెక్క. ఖరీదైన జీవితం గడుపుతున్నా అటువంటి స్పందన లేకపోతే మనిషిగా బతకనట్లే అర్థం.

# మనసు



స్టేషన్‌కి ఎదురుగా వున్న కాకాహోటల్ ''భోజనం తయార్'' అనే బోర్డుతో ఎదురుచూస్తోంది.

చెట్లపైని కాకులు ఎండకి తట్టుకోలేక, రెప్పలు టపటప కొట్టుకుంటూ, 'కాకా' అని అరుస్తున్నాయి. ఉండి ఉండి ఒకటి, రెండు ఆటోరిక్షాలు తిరుగుతున్న చప్పుడు తప్ప స్టేషను బయట వేరే శబ్దం లేదు.

రావాల్సిన రైలు గంట లేటు కావడంతో రైల్వే ప్లాట్‌ఫాం కూడా నిర్జీవంగా వుంది. ''అమ్మయ్యా! గుడ్డోణ్ణి ధర్మంసెయ్యండి సామీ, తల్లీ'' అంటూ ప్రయాణీకుల్ని అడుక్కునే 'గుడ్డోడు' సెనక్కాయలు తింటూ, ఆ పొట్లం లోని సినిమా బొమ్మల్ని దీక్షగా చూస్తున్నాడు. వాడికి కాస్త దూరంలో, సెనక్కాయలు అమ్ముకునే గంగితో పరాచికాలాడుతున్నారు రైల్వే పోర్టర్లు. వాళ్ళ చేష్టల్ని ఒక వైపు ఇష్టపడుతూనే, ఇష్టం లేనట్టుగా వాళ్ళని కసురుతోంది అది.

ఊసురోమని చతికిలబడి వున్నారురిక్షావాళ్లు.

''ఏం సెగగొడ్తాంది, నా ఎరికలో యింత ఎండ సూడ్లా'' అంగీ గుండీలు తీసి 'ఉఫ్' అని ఛాతీని ఊదుకుంటూ అన్నాడు ఈరన్న.

''ఓ, ఈ తడవ ఎండలు శానా ఉండాయి. యాడకైనా పోవల్నంటే రిచ్చా ఎక్కేటోళ్లు ఇప్పుడు వాకిలిదాటి బయటికే రాడంలేదు'' ఏదో కొత్త నిజాన్ని కనిపెట్టినట్టు అన్నాడు వెంకటేసు.

''ప్చ్, ఈ బండ్లా టయానికి రావు. బాడుగ లెట్టా దొరుకుతాయ్?'' నోట్లో వున్న బీడీ ముక్కని పడేసి తుపుక్కున ఉమ్మి, రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు ఈరన్న.

''అంజిగా, అట్లా ఎంతసేపు నిలబడ్తావ్? రిచ్చాలో కూకో అట్లా, రైలు అప్పుడే రాదులే'' అన్నాడు అంజియ్యనుద్దేశించి ఈరన్న.

ఈరన్న ఆ చెండరీలో రిక్షావాళ్ళందరిలో వయసు మళ్ళినవాడు. రిక్షాలు లేని కాలంలో వాళ్ళ తాతలు, తండ్రులు ఎద్దుల బండ్లు, గుర్రబ్బండ్లు కట్టారు. ఈరన్న రిక్షా కట్టబట్టి దగ్గరదగ్గరగా పది సంవత్సరాలు దాటుతోంది. బండ్లు టయానికి రావన్నది అతని జీవితమెరిగిన సత్యం మరి!

''కూకోరా, అంజీ కూకో'' అన్నాడు మళ్ళీ! రైలు వచ్చే దిక్కు కేసి చూస్తున్న అంజయ్యను.

''మా సెల్లమ్మ మీదికి మనసోయిందేట్రా.

## తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగుచేసేందుకుగాను మా మందు కనిపెట్టబడింది. చికిత్సను గమక పూర్తిగా పొందితే మచ్చల రంగుమారి శరీరానికి మును పటి రంగు తిరిగి వస్తుంది.

జబ్బు మొదళ్ళలో మంది కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతోసహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

### తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు. మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టురాలిన ప్రదేశాన కొత్తజుట్టు వస్తుంది. ఇది మెదడును చల్లపరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 80/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**Shyam Ayurved Bhavan(W.A.)**
**P.O. Katri Sarai (Gaya)**

## దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బల హీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనంద భరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...? అయితే రహస్యమైన మీ జబ్బుయొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలోగల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

**SHYAM AYURVED BHAVAN (A/GR)**
**P.O. KATRI SARAI (GAYA)**


మొగం అట్లా ఏలాడేసావు'' పోర్టర్లను ఒక కంట చూస్తున్న వెంకటేసు కూడా అంజయ్యను కదిలించబోయాడు.

అంజయ్యకు వాళ్ళ మాటలేవీ పట్టకున్నాయి. ఎండ సెగకంటే ఆకలి మంటని భరించడం కష్టంగా వుంది అనుకున్నాడు. నిజానికి ఆ రెండూ కలిసికట్టుగా అతడి మీద పోరాటం చేస్తున్నాయి. ''బువ్వ కండ్లబడి ఎన్ని దినాల యిందో?'' అనుకున్నాడు. రిక్షాలాగితే కష్టపడి నంతా సంపాదించవచ్చు ననుకున్నాడుగాని, ఇట్లా రొట్టెముక్కలతో, టీ నీళ్ళతో గడపాల్సి వస్తుం దనుకోలేదు. అంతో ఇంతో వస్తే అది రిక్షా బాడుగకే సరిపోయేది. ''ఇట్టా అయితే ఏం తినేది, ఎట్టా బతికేది'' అతడి మనస్సంతా దిగులైపొయ్యింది. కాటికి కాళ్ళు చాపి వున్న ముసలి తల్లీ తండ్రీ, పెండ్లాం, పిల్లలూ గుర్తు కొచ్చినారు. ''ఏంది తింటాండారో! వానలు సరిగా రాకపాయ. పనులు లేకపాయ. పూట గడవడమే కష్టమైపాయ! వానలు సరిగ్గా వస్తాంటే పెళ్ళాం పిల్లల్ని ఇడిసి ఇంతదూరం వచ్చే పనేం వుంది? ఏదో ఒక పనోపాటో చేసుకుని ఆడే ఎట్లో, ఒకట్ల వుండేవాళ్ళం. ఎన్ని దినాలని ముసిలోళ్ళనీ సంటిబిడ్డల్నీ పస్తులెడతాం? పనే దైనా దొరుకుతాదని పొట్ట సేత్తో పట్టుకుని ఈటి కొచ్చినా. ఈడా అట్లనే వుండే. రిచ్చాలో కాళ్ళు బారచాపి కూకోడమే గాని బాడుగలే లేక పాయనే'' అంజయ్య మనస్సులో విచారం అలుము కోసాగింది.

''బండి వచ్చినాదిరా'' అనే అరుపుతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. ప్లాట్‌ఫారం మీద పండ్లు, టీ, కాఫీ, ఇడ్లీ, వడ అమ్ముకునేటోళ్ళు అదేపనిగా అరుస్తున్నారు.

దాదాపు పరుగెత్తినంత వేగంగా ప్రయాణికులు ప్లాట్‌ఫాం నుండి బయటికి వచ్చే గేటు దగ్గరకి చేరుకున్నాడు అంజయ్య. ఇంకా టికెట్లు కలెక్టరు చేతికి టిక్కెట్లు ఇస్తుండగానే ప్రయాణికుల చేతుల్లోని సూటుకేసుల్ని, సంచుల్ని లాక్కుని నేర్పుగా బాడుగ దక్కించుకుంటు న్నారు రిక్షావోళ్ళు, ఆటోవోళ్ళు.

ఓ నాలుగైదు బాడుగలు మించి జనం దిగలేదు. అవీ అంజయ్య వరకు రానేలేదు. ఏ బాడుగా దొరక్కపొయ్యేసరికి దిగులుగా మూలి గింది అంజయ్య మనస్సు.

''ఎల్లెల్లు, పెద్దాసుపత్రికాటికి రెండ్రూపాయలిస్తడంట. ఆ బాడుగకు వొచ్చేటోడు రిచ్చావోడేనా'' ఎగతాళిగా ఎవర్నో కసురుతున్నాడు వెంకటేసు.

''సినెమాటైయిం అయింది, ఆటికి పోదాం'' అంటూ కదిలారు బాడుగ దొరకని రిక్షావోళ్ళు.

అంజయ్యకు నీరసంగా వుంది. అది ఆకలి వల్లనో, బాడుగ దొరకక ఏర్పడ్డ నిరుత్సాహం వల్లనో తెలియలేదు. 'పొద్దుట్నుండీ బోణీకాలా' అనుకున్నాడు మనసులో దిగులుగా, నీరసంగా రిక్షా ఎక్కాడు.

అంతలోనే, ఇంతకు ముందు వెంకటేసు కసిరిన పిల్ల అంజయ్య రిక్షాకు అడ్డంగా వచ్చింది.

''అన్నా, అన్నా, మాయమ్మకి శానా బాలేదు, పెద్దాసుపత్రికి పోవల్ల. నాకాడ రెండ్రూపాయ లుండాయి. నీ కాళ్ళు మొక్కుతానన్నా, రిచ్చా కట్టన్నా'' పది, పన్నెండేళ్ళ పిల్ల, అంజయ్యను దీనంగా బంగపోతాంది.

ప్రక్కన ఆ పిల్ల తల్లి కాబోలు ఎముకల గూడులా వుంది. చిరిగిపోయిన దుస్తుల్తో, చింపిరి జుట్టుతో పేదరికానికి రూపాల్లా వుండారు.

ఆ పిల్లని చూడగానే అంజయ్య మనసులో కూతురు మెదిలింది. పల్లె వదిలి వస్తాంటే తన కాళ్ళకు అడ్డంపడి ''నేనూ వస్తానయ్యా, నీకు బువ్వ వండిపెడతా, ఓటల్లో బోకులు కడుగుతా'' అని భోరున ఏడవడం గుర్తువచ్చింది. ''ఏం, కష్టాలు పడతాండారో!'' కళ్ళు చెమర్చాయి బిడ్డలు గుర్తురాంగానే.

''అన్న, అన్న రిచ్చాకట్టన్నా'' దీనంగా అంజయ్యను బంగపోతాందాపిల్ల.

తల్లి కోసం ఆ పిల్లపడే ఆరాటం అంజయ్యను కలిచివేసింది. వాళ్ళకి సహాయపడాలని వుంది. కాని ''పొద్దుటేల నుండి బోణీకాలా. కడుపులో టీ నీళ్ళయినా పడకపాయ, రిచ్చా బాడుగెట్టా కట్టాల. బజారు కాటికెళ్తే సినేమా బాడుగైనా దొరుకుతాదేమో! అదీ వదులుకుంటే ఎట్లా'' సంకటంలో పడ్డాడు మళ్ళీ.

''రారోయ్! పదకొండు గంటలాట ఇడిసే టయిం అయింది. టాకీసు కాటికి పోదాం'' అంటూ అంజయ్యను కేకవేశాడు ఈరన్న.

ఆ కేకతో ఆ పిల్ల ఏడుపు ఎక్కువయింది.

అంజయ్య తప్ప, ఇంకో వాహనం లేదక్కడ.

తల్లీకూతుళ్ళని అట్లా వాళ్ళ దారిన వాళ్ళని వదిలేయడానికి అతని మనస్సొప్పలేదు. అక్కడ తన పిల్లలూ,భార్యా ఏం అగచాట్లుపడుతున్నారో! ఇట్లానే ఏ దిక్కూ లేకుండా, నిస్సహాయంగా ఏడుస్తున్నారేమో!

ఆ ఆలోచన రాగానే తక్కువ ఒక నిశ్చ యానికి వచ్చాడు.

''నువ్ ఎల్తాండన్నా. పెద్దాసుపత్రికాడ బాడుగ దింపేసి వస్తా'' అన్నాడు ఈరన్నతో.

ముసలమ్మని భద్రంగా రిక్షాలో ఎక్కించి, ''మీయమ్మని, గట్టిగా పట్టుకుని కూకో'' అని ఆ పిల్లకి చెప్పి రిక్షా పోనిచ్చాడు.

''రేయ్, పెద్దాసుపత్రి యాడుందో తెలుసునా? పది రూపాయల బాడుగరా అది. థూ, ఎర్రినాయాల'' అంటూ వెనక ఎర్రన్న తిట్టబట్టినాడు.

అంజయ్యకి తెలుసును, అది పది కాకున్నా, ఆరేడు రూపాయల బాడుగని, రిక్షా బాడుక్కి పోను ఆ పూటకి టీ నీళ్ళకి కూడా సరిపడతాదని. కానీ ''డబ్బు మొగం చూసుకుంటే ఎట్లా? సమయం పడినప్పుడు మనిసికి మనిసి అడ్డు పడొద్దా?'' అని సమాధానపడ్డాడు.

కాస్తంత దూరం ఇగ్గి 'ఎండ సంపుతాంది' అనుకున్నాడు. పొద్దుట్నుండి కడుపులో ఏమీ పడక నీరసం వస్తోంది. తల్లీ, కూతుళ్ళని ఇగ్గడం కష్టంగా వుంది అంజయ్యకు. దానికి తోడు గుంటలు పడ్డ తారు రోడ్డు! అయ్యే పనికాదని రిక్షా దిగాడు. అడ్డపంచి మోకాళ్ళ కాడికి బిగించి కట్టి, నడుస్తూ రిక్షాని లాగటం మొదలెట్టాడు. ఎండకి తారు కరిగి కాళ్ళ కంటుకుని 'చురుక్కు'మంటోంది. తలలో నుండి చెమట అతడి ముఖం మీదకు కారి పెదాలకు ఉప్పగా తగుల్తోంది. 'కాసిన్ని నీళ్ళయినా తాగితే బాగుండు' అనుకున్నాడు రోడ్డు పక్కన వున్న కొట్టాల దిక్కు చూస్తూ.

''అన్నా, రిచ్చా ఇస్పీడు పోనియ్'' రిక్షాలో పిల్ల ఏడుపుతో ఉలిక్కిపడ్డాడు. గబాల్న రిక్షా ఎక్కి, శక్తినంతా కూడదీసుకుని మళ్ళీ తొక్కుతున్నాడు. 'ముసలమ్మకు ఏమన్నా అయితే,'' ఆ ఆలోచన రాగానే గుండె దడదడ కొట్టుకుంది. నీళ్ళ తాగే కోరిక వెనక్కి నెట్టి, తనకు తెలియకుండానే వేగం హెచ్చించాడు.

ఒక పది, పదైదు నిముషాలు అంజయ్యకు రోడ్డు తప్ప ఏమీ కనిపించలేదు.

అల్లంత దూరంలో పెద్దాసుపత్రి కనిపించగానే 'హమ్మయ్య' అనుకున్నాడు. ఏ కీడూ జరక్కుండా వాళ్ళని హాస్పిటల్‌కి చేరుస్తున్నందుకు తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

ఆ ఆనందంలో పెద్దాసుపత్రికి రానే వచ్చింది. రిక్షాను హాస్పిటల్ కాంపౌండులోపలకి పోనిచ్చాడు. రిక్షా ఆపి, తల్లిని భద్రంగా దింపాడు. ఆ పిల్ల అంజయ్య చేతిలో రెండ్రూపాయల కాగితం పెట్టింది. ప్రశ్నార్థకంగా ఆ పిల్ల ముఖంలోకి చూశాడు. ''నా కాడ ఇంకేటి లేదన్నా'' అంది ఆ పిల్ల దీనంగా, ఇంక అంతకంటే ఇవ్వలేకపోయానన్న అసంతృప్తి ఆ పిల్ల ముఖంలో అంజయ్య చదవగలిగాడు. అంజయ్య ఆలోచన అది కాదు, చేతిలో పైసా కూడా లేని ఈ పిల్ల తల్లిని ఎట్లా గట్టెక్కించుకుంటుందోనని. ఆ పిల్ల చేతికి ఆ కాగితం తిరిగి ఇస్తూ ''మీ యమ్మకి ఏదన్నా తిండి కొనిపెట్టు'' అన్నాడు. ఆ పిల్ల తల్లి కూడా మెల్లంగా చేతులెత్తి అంజయ్యకు కృతజ్ఞతగా జోడించింది. ''నాదేం వుంది అక్కా, చేతి కష్టమేగదా. నీ కాయలా బాగవల్ల'' అని చెప్పి రిక్షా ఎక్కాడు.

ఆసుపత్రి నుండి బాడుగ దొరికే టయం కాదు అది. అందుకే బజారు వైపు రిక్షాను పోనిచ్చాడు.

''అయ్యోయ్, అయ్యా'' అని దగ్గరగా వినిపించడంతో రిక్షాని సడెన్ బ్రేకు వేశాడు.

ఎదురుగా కన్నీళ్ళతో కూతురూ, కొడుకూ.

వాళ్ళని అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు అంజయ్య. పరిస్థితి తెలియక గట్టిగా దగ్గరకి తీసుకున్నాడు ఇద్దర్నీ.

''ఏంర్రా, ఈడున్నారెందుకు? ఏమయ్యింది'' ఆదుర్దాగా అడిగాడు.

అల్లంత దూరంలో ఏడుస్తూ నిలబడి వున్న అంజయ్య తల్లిని చూపించారు వాళ్ళు బిక్కముఖాలతో.

''ఏమయ్యిందే?'' పిల్లల్ని వదలి తల్లి దగ్గరకు పరిగెత్తాడు అంజయ్య.

"నీ పెళ్ళాం పోయిందిరో. కడుపు నొప్పితో మెలికలు తిరిగిపోతాంటే...'' తల్లి మాటలు వినిపించుకోకుండా తల్లి చూపించిన దిక్కుకి పరుగెత్తాడు. ఎద్దుల బండిలో కట్టెలాగ బిగుసుకుపోయి వుంది అంజయ్య పెళ్ళాం శవం.

''... ఆ యేళకు బస్సు దొరక్క, ఆసామిని బంగపొయ్యి బండికేసుకొచ్చినాం. ఆలిస్యం అయిపోయింది, పెద్దాపరేసన్ సెయ్యాల్ల, ఐదు నూర్లు తెమ్మనింది డాక్టేరమ్మ. యాడ నుండి తెస్తుతల్లి అని కాళ్ళు పట్టుకున్నా... యినలా...'' భోరున ఏడుస్తూ చెప్పసాగింది అంజయ్య తల్లి.

అంజయ్య నోట మాట రాలేదు. శిలా విగ్రహంలాగ నిల్చుండిపోయాడు. ఎండ సెగ, ఆకలి మంటలు గుర్తుకురాలేదు. పెళ్ళాన్ని పోగొట్టుకున్న అతని మనస్సు దుఃఖంతోనూ, నిస్సహాయతతోనూ కుమిలిపోతోంది.

'డాక్టరమ్మ, డాక్టరమ్మ' అన్న కలకలం వినిపించింది. హుందాగా నడిచి వస్తున్న ఆమె వెనక 'తల్లీ నువ్వు దిక్కు' అంటోంది ఒక ముసలామె, "అమ్మఅమ్మా అన్ని దుడ్లు ఇచ్చుకోలేం నువ్వే గట్టెంక్కించాల'' అంటూ బంగపోతున్నాడు ఇంకో పెద్దాయన...

వాళ్ళని పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా కారు ఎక్కి దూసుకుపోయింది ఆమె.

''ఆయమ్మనే...'' ఇంక మాటలు రాక కారు వెళ్ళిన దిక్కుకేసి చూస్తూ నోట్లో చీర చెంగు కుక్కుకుంది అంజయ్య తల్లి.

తిండిలేని తను ఆ పిల్లనూ, తల్లినీ ఇంత దూరం రిక్షాలో వూరికే తీసుకొచ్చాడు. ఎందుకు? కొద్దిపాటి తన కష్టంతో ఒక మనిషి ప్రాణం నిలబడుతుందేమోని. అన్నీ వున్న డాక్టరమ్మ అట్లా అనుకోలేదు. ఇట్లాంటోళ్లకు మనుసులిచ్చే డబ్బే కానీ మనిషి మనసు అక్కర్లేదా? అనుకున్నాడు అంజయ్య. ●

## తలపాగా మోజు

శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మైసూర్ తలపాగా ధరించేవారు. తలకి పాగా చుట్టడం కోసం ప్రత్యేకంగాకొంత మంది వ్యక్తుల్ని నియమించుకునే వారాయన. రామశాస్త్రి అనే ఆయనకి నెలకి 15 రూపాయిలు. ( ఆరోజుల్లో స్కూలు మాష్టారి జీతం!) ఇచ్చి తలపాగా చుట్టించుకునేవారు. ఆ తర్వాత దఫేదార్ జట్టి అనే వ్యక్తి నెలకి ఒకటి రెండు సార్లు ఆయనింటికి వచ్చి ఒక డజనో, అరడజనో తల పాగాల్ని చుట్టి అతి భద్రంగా టిన్ బాక్సుల్లో (వాటి కోసం ప్రత్యేకంగా తయారుచేయబడ్డవి) అమర్చి వెళ్ళేవాడు. ఆయన ఏ ప్రదేశానికెళ్ళినా ఈ తలపాగా పెట్టెలు కూడా ప్రయాణం చేసేవి. ''మైసూర్ టర్బన్'' అంటే ఎంతో ప్రీతి ఆయనకి. మునిస్వామి అనే కుర్రాడు ఆ వస్త్ర ధారణలో తోడ్పడేవాడు. ఆయన చనిపోయేప్పుడు అపస్మారక స్థితిలో కూడా వెత్తిన తలపాగా, సూటు ధరించే వున్నారుట. అస్సలు దుస్తుల మడత నలగ నిచ్చేవాగు కాదు. కట్టిన టై తిరిగి ధరించేవారు కాదు. రోజుకో ''టై'' మార్చి అవతల గిరాటేశావార ట! తన క్రింది ఉద్యోగస్తులందర్నీ రోజూ గడ్డం గీసుకుని రమ్మని ఆదేశించేవారు.

సేకరణ: అచ్యుతుని రాజ్యశ్రీ

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్